అవగాహన సరే..ఆచరణ ఏదీ?


శెట్టూరు ఆరోగ్య ఉపకేంద్రం వద్ద నెలకొన్న అపరిశుభ్రత


ఆరోగ్య ఉపకేంద్రంలోకి వస్తున్న మురుగునీరు


ఆరోగ్య కేంద్రం వద్ద పందులు తిరుగుతున్న దృశ్యం

- అనారోగ్య కారకాలుగా ఆరోగ్య కేంద్రాలు
- చెత్తదిబ్బల్లా హెల్త్ సబ్ సెంటర్లు
- అపరిశుభ్రతతో దోమలు విజృంభన
- పట్టించుకోని సిబ్బంది

శెట్టూరు: ఆరోగ్య కేంద్రాలు స్వచ్ఛత,పరిశుభ్రతకు నిలయాలుగా ఉండాలి.. ఆహ్లాదకర వాతావరణం నెలకొని ఉండాలి.. అయితే ఇటీవల కాలంలో అనారోగ్య కారకాలుగా మారాయి. పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొని ఉన్నా పట్టించుకునేవారు లేరు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది.. ఆస్పత్రి ఆవరణలో అధ్వానంగా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సిబ్బందితీరుపై అవగాహన కల్పించడం సరే.. ఆచరణ ఏదీ? అని ప్రజలు చర్చించుకుంటున్నారు.


లక్ష్మంపల్లిలోని సబ్‌సెంటరు వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

శెట్టూరు మండలంలోని శెట్టూరు, ములకలేడు ఆరోగ్య ఉపకేంద్రాల పరిసరాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. మురుగునీరు నిలిచి అధ్వానంగా ఉన్నాయి. చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తున్నా..పట్టించుకునేవారులేరు. శెట్టూరు ఆరోగ్య ఉపకేంద్ర ప్రాంగణంలోకి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మురుగునీరు, వర్షపునీరు వచ్చి చేరుతోంది. స్థానిక ఇళ్లలో నుంచి వ్యర్థాలు తెచ్చి, ఆస్పత్రి పరిసరాల్లో పడేస్తున్నారు. చాలా కాలం నుంచి శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్రతగా మారింది. వైద్య సిబ్బంది విధులకు వచ్చి వెళ్తున్నారుగానీ పట్టించుకోవడంలేదు. అనారోగ్యంతో ఆరోగ్య ఉపకేంద్రాల వద్దకు వచ్చే ప్రజలు అపరిశుభ్రతను చూసి, వీధులే నయం అన్నట్లు మాట్లాడుకుంటున్నారు. ములకలేడులో ఆరోగ్య కేంద్రం కూడా అధ్వానంగా మారింది. ఆస్పత్రి గదులను శుభ్రం చేసేవాళ్లులేక లోపల బూజుతో, బయట నుంచి గాలికి వచ్చి పడిన చెత్తాచెదారంతో నిండిపోయింది.

అసలే సీజనల్ వ్యాధులు...

నెల రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో గ్రామాల్లో అన్ని వయసుల వారు రోగాలబారిన పడుతున్నారు. మలేరియా, డెంగీ, డయేరియాతో బాధపడుతున్నారు. దీనికితోడు గ్రామాల్లోని వీధులలో పరిశుభ్రత, చెత్తాచెదారం పేరుకుపోయింది. గ్రామంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు ఉన్న పరిశుభ్రతపై కార్యక్రమాలకే పరిమితమవుతున్నారు. గ్రామాల్లో వీధులను శుభ్రం చేయడానికి పారిశుద్ధ కార్మికులు ఉన్నారు. చెత్తను నిల్వ చేయడానికి చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో ఆరోగ్యకరంగా...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో వెల్‌నెస్ సెంటర్లు నిర్మించారు. గత ప్రభుతంలో కై రేవు, పెరుగుపాళ్యం, తిప్పనపల్లి, యాటకల్లు గ్రామాల్లో సెంటర్లు ఆహ్లాదకరంగా, సౌకర్యవంతంగా నిర్మించారు. వెల్‌నెస్‌సెంటర్లు నిర్మించని శెట్టూరు, లక్ష్మంపల్లి, ములకలేడు, కనుకూరు, చిన్నంపల్లి గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల భవనాలు అధ్వానంగా మారాయి.

పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తాం



ప్రతి సెంటర్‌లో శుభ్రతపాటించేలా ఆదేశాలు ఇచ్చాం. పాత ఆరోగ్య కేంద్రాలు అపరిశుభ్రతతో ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. అక్కడున్న సిబ్బందికి వాటిని పూర్తి స్థాయిలో పరిశుభ్రంగా ఉంచుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది కూడా ప్రతి ఆరోగ్య సెంటర్‌ను శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలి.

– వేణు కార్తికేయ, శెట్టూరు మెడికల్ ఆఫీసర్

క్లుప్తంగా

బాలికలకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన


విద్యార్థినులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మల్లేశ్వరి

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు వ్యక్తిగత శుభ్రతపై వైద్యాధికారిణి మల్లేశ్వరి అవగాహన కల్పించారు. కేజీబీవీలోని రైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది? అనే విషయాలపై తెలిపారు. 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహాలు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ తెలియజేశారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ కమలమ్మ, మేనేజర్ మహేష్, అధ్యాపకులు సుబ్బరాయుడు, ఆదిరాముడు, శంకర్ లింగ, వరలక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదుతో ప్రయోజనాలు


ఈ–పంట నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

బొమ్మనహాళ్: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు నమోదు చేయించుకుంటే రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని వ్యవసాయాధికారి సాయికుమార్ తెలిపారు. మంగళవారం ఏఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 9,700 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అయినట్లు తెలిపారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను రైతులు ఈ–పంట నమోదు చేయించుకోవాలన్నారు. సెప్టెంబర్ 15 వరకు అవకాశం ఉందన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి


రోగాలపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్

గుమ్మఘట్ట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని మారెంపల్లి తండా గ్రామంలో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలపై తెలియజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సగం వ్యాధులు దూరమవుతాయన్నారు. దోమకాటు వల్ల ప్రాణాంతకరమైన మలేరియా, డెంగీ, మెదడు వాపు వ్యాధులు వస్తాయని తెలిపారు. నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వేడినీటిని చల్లార్చుకుని తాగాలన్నారు.

సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి


బొమ్మగానిపల్లి పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కూడేరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి నాగభూషణ రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. నేరేడు, ఉసిరి, చింతతో పాటు మరికొన్ని రకాల మొక్కలను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, పంచాయతీ కార్యదర్శులు వెంకట నారాయణ, రఘు , సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్క నాటుదాం

బ్రహ్మసముద్రం : మండలంలోని బొమ్మగానిపల్లి గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మపేరుతో ఒక మొక్క నాటుదాం" అనే కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు షానావాజ్ , సుబ్రమణ్యం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీబీఎస్ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడిగా వన్నూరుస్వామి

ఉరవకొండ: ఏపీ వాల్మీకి బోయ సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా వన్నూరుస్వామిని ఎంపిక చేశారు. ఏపీ వాల్మీకి బోయ సంఘం హైపవర్ కమిటీ నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. విడపనకల్లు మండలం ఉండబండకు చెందిన వన్నూరుస్వామిని వాల్మీకి బోయ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు.

భారత్ ఐటీఐ అక్రమాలపై విచారణ చేయాలి


రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

రాయదుర్గంటౌన్ : పట్టణంలోని భారత్ ఐటీఐ కళాశాల విద్యార్థులను వేధిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న అవినీతి, అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం రహదారిపై ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాస్తారోకో జరిగింది. 2019–20 సంవత్సరానికి సంబంధించిన మెకానికల్, డీజిల్ ట్రేడ్ విద్యార్థులకు విద్యాదీవెన నిధులు కళాశాల ఖాతాకు జమ అయినా ఇవ్వకుండా వేధిస్తుండడంతో బాధిత విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. దాదాపు అరగంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు విద్యార్థి నేతలను అరెస్ట్ చేసి, స్టేషన్‌కు తరలించారు. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి కళాశాల అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎంపీడీఓగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

విడపనకల్లు: విడపనకల్లు ఎంపీడీఓగా శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీపై వెళ్లారు. తిరిగి సాధారణ బదిలీల్లో భాగంగా విడపనకల్లు ఎంపీడీఓగా వచ్చారు.

నిందితులను త్వరలో పట్టుకుంటాం

- కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు

రాయదుర్గం: మండలంలోని చదం గ్రామ సమీపంలోని లింగాలబండపై వెలసిన చతుర్ముఖ పశుపతినాథుడి ఆలయంలో ధ్వంసమైన రెండు నంది విగ్రహాలను అర్బన్ సీఐ శ్రీనివాసులుతో కలిసి కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు మంగళవారం పరిశీలించారు. అర్చకులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడారు. దుండగులను త్వరలో పట్టుకుంటామన్నారు. గుప్త నిధుల ముఠాపై ప్రత్యేక నిఘా ఉంచేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. అనంతరం మెచ్చిరి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో కొనసాగిస్తున్న మూడు పికెట్ పాయింట్లను పరిశీలించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అర్బన్ పీఎస్ ను సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పశుపతినాథుడి ఆలయంలో ధ్వంసమైన విగ్రహాలను పరిశీలిస్తున్న డీఎస్పీ రవిబాబు

వర్మీకంపోస్టుతో సంపద సృష్టి


కూడేరు: వర్మీకంపోస్టు ఎరువు తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


మాట్లాడుతున్న ఎంపీడీఓ షకీలాబేగం

కూడేరు: వర్మీకంపోస్టు ఎరువుతో సంపదను సృష్టించొచ్చని ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా తరగతుల్లో భాగంగా రెండో రోజు మంగళవారం వర్మీ కంపోస్టు ఎరువు తయారీపై కూడేరులోని చెత్తతో సంపద తయారీ కేంద్రంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ లక్ష్మీ నరసమ్మ. ట్రైనర్లు మురళి, పావని, రఘు, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

గుమ్మఘట్ట: గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం అయ్యేలా చూడాలని ఎంపీడీఓ నరసింహమూర్తి ,ఈఓఆర్డీ సురేశ్‌బాబు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు,గ్రామ పంచాయతీ కార్యదర్శులకు రెండోరోజు శిక్షణ జరిగింది. చెత్త నుంచి సంపద తయారు చేసుకొని ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఉండాలని తెలిపారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

విడపనకల్లు: మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఈ భాస్కర్ సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు మంగళవారం పరిశీలించారు. చెత్తను సేకరించి సంపదను సృష్టించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ తెలిపారు.

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి పెట్టండి

బొమ్మనహాళ్:పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చడానికి ప్రత్యేకదృష్టి పెట్టాలని ఎంపీడీఓ షకీలాబేగం ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు రెండోరోజు శిక్షణ ఇచ్చారు. ఈఓపీఆర్డీ దాస్, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అభివృద్ధి పనులపై సమావేశం

విడపనకల్లు: విడపనకల్లు,పెద్ద కొట్టాలపల్లి పీహెచ్‌సీలో చేపట్టబోవు అభివృద్ధి పనులపై సమావేశం ఏర్పాటు చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పీహెచ్‌సీ చైర్‌పర్సన్, ఎంపీపీ కరణం పుష్పావతి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మెడికల్ ఆఫీసర్లు శ్రీకాంత్, రాజేంద్ర పాల్గొన్నారు. ఆస్పత్రిలో చేపట్టబోవు అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తీర్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీతాబాయి, సర్పంచులు చంద్రశేఖర్, మోదుపల్లి రామాంజనేయులు, రాజన్నస్వామి, ధనలక్ష్మి, సూపర్‌వైజర్ తిరుపాల్‌నాయక్ పాల్గొన్నారు.


సమావేశంలో చర్చిస్తున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ

అంజన్నకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం రెండో మంగళవారం సందర్భంగా అంజన్నకు విశేష పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, అర్చనలు, అభిషేకాలు చేశారు. ప్రత్యేక పుష్పాలంకరణ, వెండి కవచాకలంరణ, వెండి తమలపాకు అలంకరణ , ఆకు పూజ చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎండీ రాప్స్ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నరసింహారెడ్డి, సర్పంచ్ పరమేశ్వర, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ జెండాలతో మహిళల ర్యాలీ


ఉరవకొండలో జెండాలతో మానవహారం ఏర్పాటు చేసిన మహిళా సంఘాల సభ్యులు


కుందుర్పిలో 300 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఉరవకొండ: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగాలో భాగంగా ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వెలుగు సంఘాల మహిళలు, ఆనిమేటర్లు, ఉద్యోగులు మంగళవారం మానవహారం ఏర్పాటు చేసి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి క్లాక్‌టవర్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైకేపీ ఏపీఎం శివయ్య, సీసీ నారాయణస్వామి మాట్లాడారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం తెలపాలన్నారు. మహిళా సంఘాలకు ప్రతి ఒక్కరికీ జాతీయ జెండా అందిస్తున్నామన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

రాయదుర్గంటౌన్: అజాదీకా అమృత్ మహోత్సవ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని ప్రిన్సిపాల్ రఘురామమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులంతా తమ ఇళ్ల పరిసరాల్లో ప్రతి ఇంటి యజమానికీ అవగాహన కల్పించి త్రివర్ణపతాకం ఎగురవేసే విధంగా చూడాలన్నారు.

ప్రతి ఒక్కరూ దేశ భక్తిని పెంచుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంచుకోవాలని బీజేపీ నాయకులు అన్నారు. మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కుందిర్పి ప్రధాన రహదారుల్లో 300 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ, ర్యాలీగా వెళ్లారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలంలోని ముద్దలాపురం సమీపంలోని అనంతపురం– బళ్లారి ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బళ్లారికి చెందిన ఈరన్న గౌడ్, వంద్రప్ప గాయపడ్డారు. ద్విచక్ర వాహనంపై బళ్లారి నుంచి వీరిద్దరూ అనంతపురం వెళ్తుండగా, మార్గంమధ్యలో కుక్క అడ్డు రావడంతో హఠాత్తుగా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి కిందపడ్డారు. స్థానికుల సహాయంతో కూడేరులో చికిత్స పొందారు.

నేడు వాహనాల వేలం

ఉరవకొండ: సెబ్ నేరాల్లో స్వాధీనం చేసుకున్న వివిధ వాహనాలను బుధవారం వేలం వేయనున్నట్లు ఉరవకొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.కిశోర్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు రోడ్డు వద్ద ఉన్న సెబ్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్స్‌తోపాటు , రూ.3 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

నేడు ఆధార్ క్యాంపులు

కుందుర్పి: కుందుర్పి, మహంతపురం గ్రామ సచివాలయాల్లో బుధవారం ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనరసింహ ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించని వారందరూ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.


సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేష పూజలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి పంచామృతాభిషేకాలతో పాటు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ఆకుపూజ, నిర్వహించి ప్రత్యేకంగ పట్టు వస్త్రాలతో, బంగారు ఆభరణాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయంలోని మంజునాథునికి రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతి అందించారు.

గుట్ట మాయం .. ప్రకృతికి గాయం

- యథేచ్ఛగా వనరుల విధ్వంసం
- ప్రజలను ఏమార్చి.. ప్లాట్లుగా మార్చేస్తున్న వైనం
- బీటీపీ లేఔట్‌లో జోరుగా అక్రమ వ్యాపారం

రాయదుర్గం: పట్టణ పరిసరాల్లోని బీటీపీ లేఔట్ అక్రమార్కులకు నిలయంగా మారింది. ప్రకృతి వనరు అయిన గుట్టను మాయం చేసి పర్యావరణానికి గాయం చేస్తున్నారు. అధికారుల కళ్లెదుటే యథేచ్ఛగా వనరుల విధ్వంసానికి పాల్పడుతుంటే అడ్డుకోకుండా వారికే వంతపాడుతున్నారు. వైఎస్సార్ హయాంలో ఈ లేఔట్ ఏర్పాటైంది. అప్పట్లో దీనికి పెద్దగా డిమాండ్ ఉండేది కాదు. తాజాగా దీని చుట్టుపక్కల వెలసిన ప్రైవేట్ వెంచర్లలో సెంటు రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వరకు విక్రయిస్తున్నారు. దీంతో ఈ లేఔట్ పై అక్రమార్కుల కన్నుపడింది. అసలైన లబ్ధిదారుల స్థానాల్లో బోగస్ కబ్జాదారులు చేరిపోయారు. తాజాగా గుట్టను సైతం కరిగించి కొందరు ప్లాట్లు వేసుకోగా, మరికొందరు తమదే అన్నట్టు చదునుచేసుకుంటున్నారు. అత్యంత ఖరీదైన రిజర్వ్ స్థలాన్ని కొందరు కబ్జాచేసి పునాదులు నిర్మించుకున్నారు. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో లేఔట్ ఉండడంతో అవసరమైన కార్యాలయాలు నిర్మించుకునేందుకు భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని స్థానికులు అంటున్నారు.


బీటీపీ లేఔట్‌లో కబ్జాకు గురవుతున్న గుట్ట

విలాసవంతంగా పునాదులు..

సాధారణంగా ప్రభుత్వం ఇచ్చేదానికంటే రెండింతలు విలాసవంతంగా పునాదులు వెలిశాయి. 2.5 సెంట్లకు బదులు ఏకంగా 5 సెంట్లను దర్జాగా ఆక్రమించుకున్నారు. అందులో కొందరు ఇళ్లను నిర్మించుకోగా, మరికొందరు అమ్మకానికి పెట్టారు. ఇటీవల మున్సిపల్ పాలకులు, అధికారులు పరిశీలించి, కొన్ని అక్రమంగా వేసిన పునాదులను గుర్తించి కూల్చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని స్థానిక రెవెన్యూ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. అసలైన లబ్ధిదారులు ఎవరు? బోగస్ ఎవరు? ఓపెన్ సైట్ ఎంత ఉంది? అందులో నిర్మాణాలు చేపట్టినది ఎవరు? అనే కోణంలో విచారణ జరిపిస్తే.. అక్రమార్కుల బాగోతం వెలుగుచూస్తుంది. సంబంధిత ఉన్నతాధికారులు లేఔట్‌లో జరిగిన అక్రమాలపై నిశితంగా పరిశీలించి, పేదలకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విచారణ చేయిస్తాం

బీటీపీ లేఔట్‌లో గుట్టను చదును చేసినదానిపై విచారణ చేయిస్తాం. ఇందులో ప్రభుత్వ భూమి ఎంత? ప్రైవేటు వ్యక్తుల భూమి ఏదైనా ఉందా? అనే కోణంలో విచారిస్తాం. పేదలకు ఇచ్చిన పట్టాలను కొందరు తారుమారు చేసి విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతాం. రిజర్వు సైట్ ఎట్టి పరిస్థితుల్లో కబ్జాకు గురికాకుండా చూస్తాం.

– రాణిసుస్మిత, ఆర్డీఓ, కళ్యాణదుర్గం